# హృదయ ఫలకం

**-దర్భా లక్ష్మీఅన్నపూర్ణ**

రోజూ చేసినట్టుగానే యాంత్రికంగా, చకచకా పనిచేసుకుపోతోంది గానీ లక్ష్మీమనస్సు మాత్రం చకచకా ముందుకి సాగడంలేదు. అసలు మామూలుగా అయితే పనిచేసేటప్పుడు తనకి మాత్రమే వినిపించేలా కూనిరాగాలు తీసుకోవడం అలవాటు లక్ష్మికి. ఎంత శ్రమనైనా, కష్టాన్నయినా ఆడుతూ పాడుతూ దాటెయ్యాలన్నది ఆమె సిద్ధాంతం. అయినా ఇవ్వాళ ఆమె మనస్సుని వేధిస్తున్న సమస్య మాత్రం కూనిరాగాలని పలికించేలా లేదు.

ఆ సమస్యకి పరిష్కారం ఆరోజు మధ్యాహ్నం రెండుగంటలలోపు దొరికిపోవాలి. అదృష్టం అనేది అస్తమానం తలుపు తట్టదంటారు. పనిచెయ్యడం పూర్తిచేసిన లక్ష్మిసందిగ్ధంలో సతమతమయిపోసాగింది. అమ్మ గారి మనస్తత్వం లక్ష్మికి కొత్తేంకాదు.

డబ్బు విషయంలో చాలా గట్టి. అటు చెప్పి ఇటు చెప్పి ఇవ్వాల్సిన డబ్బులు కన్నా ఒక్కరూపాయి తక్కువే ఇస్తుంది కానీ ఎక్కువ ఇవ్వడం అనేది జరగదు.

కానీ తన సమస్యని అర్థం చేసుకునైనా సహాయం చెయ్యదు అమ్మ.

'అడుగు!ఫర్వాలేదు' అని ఓ పక్క మనస్సు ప్రోత్సహిస్తోంది. కానీ మనస్సులో ఎక్కడో నువ్వాశించింది జరగదు అన్న సంకేతమే వినిపిస్తోంది.

ప్రతిభ సోఫాలో కూర్చుని ఏదో పుస్తకం తిరగేస్తోంది. లక్ష్మి వెళ్లిపోతే బయటికి వెళ్దామని ఎదురు చూస్తోంది. లక్ష్మి కిచెన్‌లో నిల్చుని సందిగ్ధంలో నలిగిపోతూ చేతులు నులుముకుంటోందన్న విషయం ఆమెకి తెలీదు.

అమ్మగారు కాదూ అంటే ఉన్న ఒక్క ఆధారం పోయినట్టే అన్న భయం లక్ష్మిని భయపెడుతోంది. తన విన్నపాన్ని అమ్మగారు అర్థం చేసుకునేలా చూడమని వేయి దేవుళ్ళకి మొక్కుకుంటోంది.

తనేం సినిమాలు చూడడానికీ, లేకపోతే చీరలు కొనుక్కోవడానికీ ఏం అడగడం లేదుగా డబ్బు. అదీ అప్పుగానే కూడాను. రెండునెలలు పనిచేస్తే అప్పు తీరిపోతుంది. అని తన మనస్సుకి సర్దిచెప్పుకుని ధైర్యం చెప్పుకునీ అడగాలనుకుంటోంది గానీ లక్ష్మికి అడుగుముందుకి పడడం లేదు.

* * *

ఏవిటీ ఈ అమ్మతీరు! అడగాలంటేనే బెరుగ్గా ఉంది. పక్క బ్లాకులో శారదమ్మగారుండి ఉంటేనా తనకీ బాధ ఉండేదికాదు.

కిచెన్‌లో ఏదో ఇంకా అక్కడా ఇక్కడా తుడుస్తున్నట్లుగా నటిస్తూ ఆలోచిస్తోంది లక్ష్మి. అదేంటి ఆ శారదమ్మని అడగడానికింత భయంగాను, ఆందోళగానూ అనిపించనే అనిపించదు.

ఆ అమ్మ ఇస్తుందో, ఇవ్వదో వేరే సంగతి. అడగడానికి మటుకు తనకి బిడియం ఉండదు. భయం ఉండదు.

ఆ తేడా అంతా ఆమాటతీరులోనే ఉన్నట్టుంది. ఎంత ఇదిగా మాట్లాడినా ఈ అమ్మ గొంతులో తనని ఆమడదూరంలో ఉంచే తీరేదో ఉంది.

పేదవాడికి అత్యవసర సమయంలో డబ్బున్నవాడు సహాయం చెయ్యకపోతే ఎలాగా? అది ఈ ప్రకృతి ధర్మంగా ఎవరూ ఎందుకు పెట్టలేదు?

ఆలోచిస్తూనే తుడిచిన గట్టునే మళ్లీ మళ్ళీ తుడుస్తోంది లక్ష్మి.

శారదమ్మని అడగడానికి నిజానికి తనకి ఎందుకు భయంగా అనిపించదు?

ఆ అమ్మకి ఎదుటివాళ్ల అదీ తమలాంటి వాళ్ళ కష్టాలని అర్థం చేసుకునే జాలి గుండె ఉందనా?

ఈ అమ్మకి ఆ గుండె లేదా?

మనం మనుషుల్ని ప్రత్యేకంగా పరిశీలించకపోయినా అలా పరిశీలించే సందర్భం రాకపోయినా కూడా వాళ్ల మాట తీరు, చిన్నచిన్న విషయాలకయినా వాళ్లు స్పందించే తీరు ఎదుటివాళ్లమీద అప్రయత్నంగానే ఒకరకమైన ముద్ర వేసి వాళ్ల మీద ఒక అభిప్రాయానికి వచ్చేలా చేస్తుంది.

ఈ అమ్మకి ఆ గుండె ఉన్నా లేకపోయినా ఇప్పుడు తను సహాయం అడక్క తప్పదు. తన అదృష్టం బావుంటే సరేనంటుంది.

"ఏవిటే లక్ష్మి ఇంకా పనవ్వలేదూ! నేను బయటికి వెళ్లాలి. తొందరగా ముగించు" అంటూ అటుగా వచ్చిన ప్రతిభ బయటికి వెళ్లబోతుంటే పిలిచింది లక్ష్మి "అమ్మగారండీ!"అని.

వెనక్కి తిరిగి ఏవిటన్నట్లు చూసింది ప్రతిభ.

"నాకు ఓ మూడువేలు డబ్బు కావాలండీ. నాజీతంలో కొట్టేసుకుందురుగానండి నెలనెలా!" రెండో వాక్యం గబగబా హడావుడిగా చెప్పేసింది.

"ఏవిటీ! మూడువేలా! ఎందుకూ పట్టుచీర కొనుక్కుంటావా ఏమిటే?" అమ్మగారి మాట లక్ష్మికెందుకో మనస్సులో గుచ్చుకున్నట్లుగా అనిపించింది.

మూడువేలు అప్పుచేసి తను పట్టుచీర కొనుక్కునే పరిస్థితిలో ఉందా? అంతే! తమలాంటి వాళ్ల కష్టాలు ఇలాంటి డబ్బున్నవాళ్లకి వేళాకోళంగానే ఉంటాయి. అంత అవసరంగానీ, కష్టంగానీ ఏమొచ్చిందని అడగొచ్చుగా. పట్టుచీర కొనుక్కుంటావా అని అడగలా?

"ఏవిటి లక్ష్మి! సమాధానం చెప్పకుండా ఆలోచిస్తున్నావ్?"

"మూడువేలు డిపాజిట్టు కడితే మా ఆయనకి ఎక్కడో ఉద్యోగం దొరుకుద్దంటమ్మగారూ!" గొంతునిండా, కళ్లనిండా ఆశనింపుకుని చెప్పింది లక్ష్మి.

"మూడు వేలు?" ప్రతిభ కళ్ళు ఆశ్చర్యంతో విప్పారాయి.

అవును అనడానికి లక్ష్మికి భయంగా అనిపించింది. ఉద్యోగం ఎక్కడ, జీతం ఎంత? అన్న వివరాలు అడిగింది ప్రతిభ.

అన్ని వివరాలు చెప్పి "రాకరాక వచ్చిందమ్మా ఈ అవకాశం! డబ్బులియ్యకపోతే చేజారిపోద్దని బయంగా ఉంది"

"ఇంత డబ్బూ తీసుకువెళ్లి తీరా నీ మొగుడి చేతిలో పెడితే వాడు దాన్ని ఉద్యోగం కోసమే


ఖర్చుపెడతాడన్న నమ్మకం ఏవిటి?'' లక్ష్మి ఒక్కసారిగా ఉలిక్కిపడ్డట్టుగా అయింది.

అమ్మగారి ప్రశ్నకి జవాబు ఏం చెప్పాలో తెలియలేదు. ఎన్నాళ్ళూ తన మొగుడు పని బద్ధకస్తుడనే ఆలోచనే గానీ ఇలాంటి అనుమానం ఎప్పుడూ రాలేదు. నిజానికి తన మొగుడు బుద్ధిమంతుడే కూడాను.

పేదరికం ఎదుటివాళ్ళకి ఇలాంటి అనుమానాన్ని కూడా కల్గిస్తుందన్నమాట.

లక్ష్మికి ఉక్రోషంగా అనిపించింది. ఆగి ఉక్రోషం గొంతులో కనిపించనీయకుండా తమాయించుకుంటూ అంది "అలాంటిదేం లేదు లెండమ్మగారూ! నా మొగుడికి ఏ చెడ్డ అలవాటూ లేదండీ. కనీసం బీడీ కూడా తాగడండి. ఎటొచ్చీ కాస్త రంగురంగుల చొక్కాలంటే ఇష్టమండి. అంతే!'' చివరి మాటల్ని ముసిముసిగా నవ్వుకుంటూ చెప్పింది లక్ష్మి.

ఆ ముసిముసి నవ్వులకి ప్రతిగా ప్రతిభ ముసిముసినవ్వులు నవ్వలేదు. డబ్బులివ్వకుండా ఉండ



డానికి ఇంకో కారణం వెతికింది.

"తెచ్చిచ్చేస్తాను! జీతంలో కొట్టుకోక్కర్లేదూ అంటావ్. కానీ ఏదీ ఇప్పటి దాకా అలా ఎప్పుడూ జరగలేదు. జీతంలో చూసుకోవడమే అవుతోంది"

లక్ష్మికేం సమాధానం చెప్పాలో తెలియలేదు. అవసరాలలా ఉన్నాయ్. తను మాత్రం ఏం చెయ్యగలదు?

"డబ్బులు తీసుకున్నాక నువ్వు పనిలోకి రావడం మానేస్తే నేనేం చెయ్యాలి?" గాజు సామాను అద్దాల అల్మైరాలో పెడుతూ ప్రతిభ అన్నమాటకి లక్ష్మికి రెండునిముషాల్లో దుఃఖం వచ్చినంత పనైంది.

ప్రతి మనిషీ తన ఆలోచనా తీరుతో, ప్రవర్తనతో ఎదుటి మనిషిలో ఒక నిశ్శబ్దమైన బంధాన్ని ఏర్పరచుకుంటాడు. అమ్మగారు తన గురించి మంచిగా అనుకుంటారనీ, తనని విశ్వసిస్తారనీ అనుకున్న లక్ష్మికి అమ్మగారి మాటలు ఈటెల్లా తగిలాయి.

తనని ఇన్నాళ్ళు నుంచి చూస్తున్న అమ్మగారికి తనమీద ఉన్న అభిప్రాయం ఇదీ అని తెలిసేసరికి లక్ష్మికి చాలా నిరుత్సాహంగా, నిస్సత్తువగా అనిపించింది.

చేసిన ప్రతిపనిలోనూ తను నిజాయితీనే చూపించింది. ఇల్లు తుడిచేటప్పుడు, వత్తేటప్పుడు టేబుల్ మీదా, మంచాల మీదా పడి ఉండే విలువైన వస్తువుల్ని ఎప్పుడూ తను ముట్టుకోనైనా ముట్టుకోలేదు.

పనిచేసే విషయంలో కూడా తను చాలా నిజాయితీగా ఉంటుంది. మిగిలిన పనివాళ్లందరూ తీసుకున్నట్టు ఎక్కువ సెలవులు తీసుకోనే తీసుకోదు. ఒకవేళ ఏదైనా తప్పనిపని వస్తే అమ్మగారికి ముందే తెలియజేస్తుంది.

ఇవ్వన్నీ మిగతా పనివాళ్లకన్నా తనని మెరుగైన స్థానంలో ఉంచుతాయనుకుంది. కానీ అమ్మగారిలా...

"నామీద మీకున్న నమ్మకం ఇదేనా అమ్మగారూ!" గొంతు వణుకుతుండగా అడిగింది.

ప్రతిభ కొంచెం తడబాటు పడింది. అయినా అంది "డబ్బులేని వాళ్ళు నూటికి నూరు పాళ్లు నిజాయితీగా ఉండాలన్నా ఒక్కోసారి వీలవదు. పరిస్థితులలా నెట్టుకొస్తాయ్. నువ్విక్కడ్నించి ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయావనుకో. నా ఇంట్లో పనిచెయ్యడానికి ఇక్కడిదాకా రాలేవు"

"నాది పూరిపాకైనా నా సొంతమే కదమ్మగారూ! మీకా బయం అక్కర్లేదు" లక్ష్మి గొంతులో ఆమెకి తెలియకుండానే కాస్త కరుకుదనం ధ్వనించింది. ప్రతిభ దృష్టిని అది దాటిపోలేదు.

'అమ్మో! దీనికి డబ్బులు ససేమిరా ఇవ్వకూడదు' అనుకుంది.

"అయినా నీకిప్పుడిన్ని డబ్బుల్తో పనికొనుక్కోవడం అవసరమా! డబ్బులివ్వక్కర్లేని పనిచూసుకోమని మీ ఆయనకి చెప్పు!" ప్రతిభ తనకి అంతమొత్తం డబ్బు ఇవ్వడం ఇష్టం లేదని రకరకాలుగా చెప్పింది. ఆఖరికి తన దగ్గర ప్రస్తుతానికి అంత డబ్బు లేదని చెప్పింది.

ఇంక అమ్మగారి చేతిలోంచి తను అడిగిన డబ్బు రావడం అసంభవం అని గ్రహించింది లక్ష్మి. నిలువునా నిస్సత్తువ ఆవహించగా ఇక దేవుడే దిక్కనుకుంది. ఇంకా రెండురోజులు టైమున్నా బావుండును. అదీలేదు. ఈసాయంకాలం లోపు డబ్బు కడితే ఉద్యోగం తన మొగుడికి వస్తుంది. లేకపోతే ఇంకెవరికో వెళ్లిపోతుంది. లక్ష్మి ఇంక వెళ్లిపోదాం అనుకుంటుండగా నలుగురైదుగురు ఆడవాళ్ళు వచ్చారు "హాయ్! ప్రతిభా!" అంటూ.

వాళ్ళు వస్తూనే ఇల్లంతా నవ్వులతో, సందడితో నిండిపోయింది.

ప్రతిభ వాళ్లని లోపలికి ఆహ్వానించి వంటింట్లోకి హడావుడిగా వచ్చి "లక్ష్మీ! గబగబా ఈ ఉల్లిపాయలన్నీ ముక్కలు చెయ్యి!" అని ఉల్లిపాయలు అక్కడ పెట్టి మళ్ళీ హాల్లోకి వెళ్లిపోయింది. కిచెన్‌హాలుని ఆనుకునే ఉండడంతో వాళ్ల మాటలన్నీ స్పష్టంగా వినిపిస్తున్నాయ్ లక్ష్మికి.

"నీకో శుభవార్త మోసుకొచ్చాం" వచ్చినవాళ్లల్లో ఒకావిడ అంటోంది.

"ఏవిటది?!" ప్రతిభ గొంతులో ఆతృత.

"మన క్లబ్ బిల్డింగ్‌లో స్విమ్మింగ్‌పూల్ లేదుకదా! మజాయే లేదనిపిస్తోందని మనం చాలాసార్లు అనుకోలేదూ! అదొకటి దాంతోపాటు మన క్లబ్ పక్కనే అనాథశరణాలయం లేదూ! వాళ్లకి కార్పొరేషన్ వాటర్ కనెక్షన్ లేక చాలా ఇబ్బంది పడుతున్నారుట.

ఇంకా ఆ చెప్పే ఆవిడ మాట పూర్తికాకుండానే "ఊళ్ళోవాళ్ళ సమస్యలన్నీ మనం ఎక్కడ తీర్చగలం!" అనేసింది ప్రతిభ.

"పూర్తిగా విను నే చెప్పేమాట. దానికీ, మన స్విమ్మింగ్‌పూల్‌కీ కలిపి పదివేలు చందా యిస్తే స్విమ్మింగ్‌పూల్ ప్రక్కన ఓ రాతిఫలకం ప్రతిష్ఠించి మన పేర్లు అక్కడ రాస్తారు! ఎంత గొప్పగా ఉంటుంది కదా!" అంది ఆవిడ.


అప్పుడే అందరికీ మంచినీళ్ళు ఇవ్వడానికి అటుగా వచ్చిన లక్ష్మి స్నేహితురాలి మాటకి ప్రతిభ మొహం వెలిగిపోవడం గమనించింది.

"స్విమ్మింగ్‌పూల్‌లోని నీటి బిందువులు నీ పేరుకి రోజూ అభిషేకం



## స్మార్ట్ రాణీ

తారలు ఎప్పుడు ఎలా మారిపోతారో ఎవరికీ తెలీదు. ఇప్పుడు రాణీ ముఖర్జీ వంతు వచ్చినట్టుంది. సినిమాల కోసం కాకుండా తన వ్యక్తిగత శ్రద్ధతో బరువును తగ్గించేసుకుంది. అయితే తానేం చేసాననేది మాత్రం తెలియజేయడం లేదు. ఇప్పుడీమె చక్కగా జీన్స్ కూడా వేసుకుంటోంది. చక్కనమ్మ చిక్కినా అందమే అంటే ఇదే కదా!



చేస్తూంటే..'' ఇంకొకావిడ అందుకుంది.

"నా జన్మ ధన్యం అయిపోతుందంటావ్!'' ప్రతిభ నవ్వుతూ ఆ మాటల్ని పూర్తిచేసింది. తర్వాత ఇంకో ఇద్దరు ముగ్గురు వాళ్ళు ఎంతెంత ఇస్తున్నారో చెప్పారు.

"అనాథశరణాలయంలో కూడా ఓ రాతి ఫలకం ఏర్పాటుచేసి మన పేర్లు రాస్తే బావుంటుంది కదా!'' ఇంకోకావిడ సూచించింది.

"ఆఁ!'' అనాథశరణాలయంలో ఉంటే ఏవిఁటిట లేకపోతే ఏవిఁటిట!'' ఇంకో మహానుభావురాలి ఉవాచ.

ప్రతిభ హడావుడిగా వంటింట్లోకి వచ్చి "లక్ష్మీ! కాస్త ఆ ఉల్లిపాయలతో పకోడీలు చేసి పెట్టేసి వెళ్ళు'' అని చెప్పేసి వెళ్ళిపోయింది. అమ్మగారి మొహాన్ని అంత ఆనందంగా ఎప్పుడూ చూడలేదు లక్ష్మి. ఇదంతా ఫలకం మీద పేరు ఆనందమే.

లక్ష్మి పదిహేను నిముషాల్లో పకోడీల ప్లేటుతో హాల్లోకి వచ్చేసరికి ప్రతిభ టీపాయ్ మీద నోట్ల కట్ట పెట్టి లెక్కపెడుతోంది. పదివేల రూపాయలంటే ఇన్ని నోట్లు ఉంటాయన్నమాట అనుకుంది లక్ష్మి ఆశ్చర్యంగా. అందులోంచి మూడువేలు తనకిస్తే....లక్ష్మికి ప్రాణం విలవిల్లాడిపోతున్నట్టుగా అనిపించింది.

పదినిముషాల్లో వచ్చినవాళ్ళు డబ్బులు తీసుకుని వెళ్ళిపోయారు.

లక్ష్మి మొహం చిన్నబోయినట్టుగా మాడిపోయినట్టుగా ఉండడం గ్రహించిన ప్రతిభ అంది "అక్కడ డబ్బులిస్తే నున్నటి గ్రైనైట్ రాతి ఫలకం మీద నా పేరు బంగారం రంగు అక్షరాలతో మిలమిలా మెరిసిపోతూ ఉంటుంది. అది ఎంత గొప్పగా ఉంటుంది. నువ్వు కూడా వచ్చి చూద్దువుగాని'' లక్ష్మిలాంటి నిరుపేద, నిజాయితీపరురాలు ఆక్షణంలో ఏం మాట్లాటగలదు?

"వస్తానమ్మగారూ!'' అని చెప్పి వచ్చేసింది ఇంటికి.

★ ★ ★

ఆరోజు లక్ష్మి భర్త ఉద్యోగం కోసం అని డబ్బులు ఎక్కడా సంపాదించలేకపోయింది. అనుకోకుండా అరుదుగా వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకోలేకపోయామన్న దుఃఖం కలిగింది. ప్రతిభ చేతిలో ఉన్న నోట్ల కట్టలు కళ్ళముందు మెదిలాయి.

లక్ష్మికి ప్రాణం విలవిల్లాడిపోతున్నట్టుగా అనిపించింది. అంత డబ్బు ఉంది. ఆ డబ్బులో కొంత చాలా చిన్నభాగానికి ఓ జీవితాన్ని నిలపగల శక్తి ఉంది.

ఆ అమ్మ మనసు తనలాంటి వాళ్ళ పరిస్థితి చూసి జాలితో ఎందుకు కరిగిపోలేదు. లక్ష్మికి పెద్ద పెద్ద పదాలు తెలియకపోయినా ఆమె భావావేశం ఇలా ఉంది.

రాతిఫలకం మీద తన పేరుకోసం ఆవిడ అంతగా తపించిపోతోందే ఆవిడ తనకే కనుక డబ్బు ఇచ్చి ఉంటే రక్తమాంసాలతో కూడిన, అనుక్షణం స్పందిస్తూ ఉండే తన హృదయఫలకం మీద ఆవిడ పేరు రాసుకుని ఉండేది కదా! రాయడమే కాదు అది శరీరంలోని ప్రతి అణువూ ఆమె పట్ల కృతజ్ఞతతో నిండిపోయి ఉండేది. రాతి మీద రాస్తే ఏం కదలిక ఉంటుంది.

తన హృదయంలో నిలిచిపోయిన ఆమె పేరుకి రకరకాల భావాలతో, ఆనందంతో అభిషేకం చేసి ఉండేది. ఎందుకంటే తన భర్తకి ఉద్యోగం అంటూ వస్తే ఇంట్లో అంతా ఆనందమే కదా. పిల్లలు చదువుకి వెళ్తూ స్వచ్ఛమైన నవ్వులు కురిపిస్తుంటే వాళ్ల కళ్లల్లో ఆనందపురంగులు కళకళలాడుతుంటే అవి అప్రయత్నంగానే తన హృదయఫలకం మీద ఆవిడ పేరుకి రంగులు అద్దవూ. జీవం లేని రంగుల అద్దకంతో ఆవిడ మురిసిపోతోంది కానీ-

స్విమ్మింగ్‌పూల్‌లోని నీటి బిందువులతో ఏవిఁటి, తన ఆనందబాష్పాలతో ఆమెకి అభిషేకం చేసేది. తన చిన్నారుల గుండెల్లో బడికి వెళ్ళి చదువుకోగలుగుతున్నాం అని పొంగిన ఆనందం పూలజల్లై ఆమెని చరితార్థురాలిని చెయ్యదూ.

నువ్వు డబ్బులు ఇచ్చి ఉంటే ఇన్ని కృతజ్ఞతాభిషేకాలు జరిగేవమ్మా నీకు! ఇప్పుడు నీ పేరు చూసుకుని నువ్వే మురిసిపోవాలి. నిన్ను పట్టించుకునేదెవరు? ఆలోచిస్తూ పడుకున్న లక్ష్మి కనుకొలకుల్లోంచి ఓ కన్నీటి బిందువు క్రిందికి జారింది.

★ ★ ★

పదిరోజుల తర్వాత అనాథశరణాలయంలో పనిచేసే అమ్మాయి కనిపిస్తే లక్ష్మి అడిగింది "మీకు కార్పొరేషన్ నీళ్ళు వస్తాయిట కదా!నీకు తెలుసా!'' అని.

"ముందలాగే అన్నారు ఆ పక్కనున్న క్లబ్‌వాళ్ళు. ఇప్పుడు మాకవదు మీరే వెళ్లి కార్పొరేషన్ వాళ్లని బ్రతిమిలాడుకోండి అని చెప్తున్నారు'' అంది.

లక్ష్మికి అమ్మగారు తనని అనుమానించిన సంగతి జ్ఞాపకం వచ్చింది.

★

## మనిషి వేసిన తొలి జోక్

మొట్టమొదటి జోక్ ఎప్పుడు, ఎవరు పేల్చారో తెలియదుగానీ ప్రస్తుతం అందుబాటులో వున్న సమాచారం ప్రకారం తొలి జోక్ ఈజిప్టులో పుట్టింది. 4,500 సంవత్సరాల క్రితం నైలు నదీ లోయలో విలసిల్లిన నాగరికతలో మరణించిన వ్యక్తి సమాధి ముందు అతని నోటి నుండి వెలువడిన హాస్య సంభాషణను నమోదు చేసేవారు. ఆనాడు వారందరూ హాస్య చతురులేమో! అక్కడ దొరికి మ్యూజియంలో భద్రపరచబడిన సమాధి రాళ్లలో అతి పురాతనంగా గుర్తించబడిన రాయిమీదున్న జోక్ ఇది. దీన్నే మొదటి జోక్‌గా భావిస్తున్నారు.

"విసుగ్గా వున్న ఫారో (రాజు)కి నువ్వు ఎలా వినోదం కల్పిస్తావు?''

"చేపలు పట్టే వలల్ని ధరించిన యువతులతో నిండిన పడవను నైలు నదిలో పంపిస్తాను. తరువాత రాజుతో చేపలు పట్టడానికి వెళ్లమంటాను''

## కళాఖండాల విలువ

ప్లాబో పికాసో సుప్రసిద్ధ స్పానిష్ చిత్రకారుడు. 20వ శతాబ్దపు చిత్రకళాభ్యుదయులే కాక అనేకమందికి స్ఫూర్తి కలిగించాడు. తన జీవితంలో వేసిన పెయింటింగ్‌లు 13,500, గ్రంథాలకు వేసిన బొమ్మలు 34,000, చెక్కిన విగ్రహాలు 300. మొత్తం వీరి కళాఖండాల విలువ వెయ్యి మిలియన్ డాలర్లు.

-బద్దిగం

